ప్రజాశక్తి
బుధవారం 11 డిసెంబర్ 2024
5
శ్రీ సత్యసాయి



ల్యాండ్‌మైన్ పేలి
జవాన్ వీరమరణం

- జమ్ముకాశ్మీర్‌లో ఘటన
- మృతుని స్వస్థలం ప్రకాశం జిల్లా మార్కాపురం
- ప్రస్తుతం నార్పలలో నివాసం
- గురువారం నార్పలలో అంత్యక్రియలు



మృతి చెందిన జవాను సుబ్బయ్య (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-నార్పల

ల్యాండ్‌మైన్ పేలి ఓ వీర జవాను వీరమరణం పొందాడు. జమ్ముకాశ్మీర్‌లో జరిగిన ఈ ఘటనలో నార్పలలో నివాసం ఉంటున్న సుబ్బయ్య(32) మరణించాడు. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలోని రాయిపాడు గ్రామానికి చెందిన సుబ్బయ్య భారత ఆర్మీలో జవాన్‌గా పని చేస్తున్నాడు. ఈయన అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రం గవ్వల వీధికి చెందిన గవ్వల రామకష్ణ కూతురు లీలావతిని పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వివాహ అనంతరం ఆయన ఉద్యోగం రిత్యా భార్యాపిల్లల్ని నార్పలలో ఉంచాడు. సోమవారం మధ్యాహ్నం జమ్మూ కాశ్మీర్లో విధులు నిర్వహిస్తున్న సమయంలో అక్కడ ల్యాండ్ మైన్ పేలింది. ఈ ఘటనలో సుబ్బయ్య తీవ్రంగా గాయపడి వీరమరణం పొందారు. సుబ్బయ్యకు భార్య లీలావతి 5వ తరగతి చదువుతున్న కుమారుడు నిఖిల్, 4వ తరగతి చదువుతున్న కుమార్తె లాస్య ఉన్నారు. నార్పలలో ఉంటున్న జవాన్ సుబ్బయ్య ఆ ప్రాంతవాసులందరికీ సుపరిచితుడు. సెలవుల్లో ఇంటికి వచ్చిన సమయంలో స్థానికులందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించేవాడు. అలాంటి వ్యక్తి ల్యాండ్‌మైన్ పేలి మరణించడంతో ఒక్కసారిగా ఆ ప్రాంత ప్రజలు దిగ్భ్రాంతికి లోనయ్యారు.

రేపు అంత్యక్రియలు

జవాన్ సుబ్బయ్య అంత్యక్రియలను బుధవారం నాడు నార్పలలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులతో పోలీసులు మాట్లాడారు. సుబ్బయ్య తల్లి, భార్యతో చర్చించిన అనంతరం నార్పలలోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించేలా కుటుంబ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నార్పల మారెమ్మ గుడి సమీపంలోని వారి సొంత వ్యవసాయ భూమిలో గురువారం నాడు అంత్యక్రియలు చేయనున్నారు. ఈ ప్రదేశాన్ని మంగళవారం మధ్యాహ్నం ఎస్ఐ సాగర్ జవాన్ సుబ్బయ్య మామ రామకృష్ణ బంధువులతో కలిసి పరిశీలించారు. సుబ్బయ్య మతదేహం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు బెంగళూరు ఎయిర్ పోర్టుకు రానుంది. అక్కడనుండి రోడ్డు మార్గం ద్వారా నార్పలకు రాత్రి 9 గంటలకు వస్తుంది. గురువారం ఉదయం 9 గంటలకు సుబ్బయ్య అంత్యక్రియలు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పింఛన్ల పరిశీలన

- పైలెట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లాలో సర్వే
- మొన్న మడకశిర మండలం అమిదాలగొంది..
- నిన్న చియ్యేడులో సర్వే...
- ఏమవుతుందోనని లబ్ధిదారుల్లో గుబులు

రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్లలో ఏరివేత మొదలు పెట్టింది. ఈ మేరకు శ్యాంపుల్ సర్వేను రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి ఒక్కో జిల్లాలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా సోమవారం నాడు శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం ఆమిదాలగొంది సచివాలయం-1 పరిధిలో సర్వే నిర్వహించారు. మంగళవారం నాడు అనంతపురం జిల్లా అనంతపురం రూరల్ పరిధిలోని చియ్యేడు గ్రామంలో సర్వే చేశారు. అధికారులు బృందంగా ఏర్పడి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అర్హతలపై ప్రత్యేక యాప్‌లో 13 రకాల వివరాలను నమోదు చేశారు. సర్వే పూర్తయిన తర్వాత ఈ సమాచారాన్ని నేరుగా ప్రభుత్వానికి పంపనున్నారు. భవిష్యత్తులో అన్ని గ్రామాల్లోనూ ఈ సర్వే ఉండనున్నట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో రూరల్ మండల పరిధిలోని చియ్యేడు గ్రామంలో పింఛన్ల లబ్ధిదారుల శ్యాంపుల్ సర్వే మంగళవారం జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు చియ్యేడు గ్రామంలోని పింఛనుదారులు అందరితోనూ వివరాలను సేకరించారు. కస్లర్‌కు ఇద్దరు చొప్పున బయటి ప్రాంతాల నుంచి సిబ్బందిని వేసి, యాప్‌లో వివరాలను సేకరించారు. గ్రామంలో మొత్తం 424 పింఛన్లు ఉన్నాయి. ఇందులో ఇద్దరు మృతులుకాగా, 15 మంది అందుబాటులో లేరు. తక్కిన అందరి వివరాలను సర్వే సిబ్బంది సేకరించారు. పైలెట్ ప్రాజెక్టు కావడంతో డిఆర్‌ఎడి పీడీ ఎంపిడిఒలతోపాటు, ఐకెపి సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

సర్వేలో అడిగిన ప్రశ్నలు

కుటుంబానికి ఎన్ని ఎకరాల భూమి ఉంది.. ఉంటే మాగాణి ఎంత... మెట్ట ఎంత అన్న వివరాలు అడిగారు. నాలుగు చక్రాల వాహనాలున్నాయా, కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగిగానీ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగానీ ఉన్నారా అన్న వివరాలను యాప్‌లో అడిగారు. సరాసరి 12 నెలల సగటు బల్లు 300 యూనిట్లు వచ్చిందా అని కూడా అడిగారు. మున్సిపల్ ప్రాంతంలో వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ ఉందా అని అడిగారు. కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారా అన్న ప్రశ్న ఉంది. దీంతోపాటు ప్రయివేటు సంస్థల్లో పనిచేస్తున్నారా అని కూడా అడగటం విశేషం. అంగవైకల్యంతో అయితే మెడికల్ వెరిఫికేషన్ అసరా అన్నది కూడా సర్వే సిబ్బంది యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. వితంతు పింఛనయితే భర్త మరణ ధ్రువీకరణ పత్రాలను అపలోడ్ చేయాల్సి ఉంటుంది.

లబ్ధిదారుల్లో గుబులు

సామాజిక పింఛను సర్వేలోనున్న ప్రశ్నలు చూసి ఏమవుతుందోనన్న గుబులు లబ్ధిదారుల్లో కనిపిస్తోంది. అందులోనూ సర్వే సిబ్బంది కూడా ఇది సరైనదేనని ధ్రువీకరించాల్సి ఉంది. సర్వే సిబ్బంది సిఫార్సు చేస్తున్నట్టు యాప్‌లో వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది. అది లేకపోతే మాత్రం పింఛన్ రద్దయ్యే అవకాశాలున్నాయి. ప్రస్తుతం చేసిన సర్వేలో ఎంత మంది అర్హులు... ఎంత మంది కాదన్నది స్పష్టత లేదు. యాప్‌లో పొందిపరచిన అంశాలు నేరుగా రాష్ట్ర కేంద్రానికి చేరుతాయి. అక్కడ వారు వివరాలు తెలిసే అవకాశముంది. ఆ వివరాలను బుధవారం జరిగే కలెక్టర్ల సమావేశంలో చర్చకొచ్చే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఇక్కడి సిబ్బంది మాత్రం ఈ వివరాలు తెలియలేదు.





సోమవారం నాడు శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం అమిదాలగొంది పంచాయతీ టిడి.పల్లి గ్రామ సచివాలయం-1 పరిధిలో పింఛన్ లబ్ధిదారులతో వివరాలు సేకరిస్తున్న అధికారులు

14న సాగునీటి సంఘాల ఎన్నికలు : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్:-

ఈనెల 14ప జిల్లావ్యాప్తంగా నిర్వహించే సాగునీటి సంఘాల ఎన్నికలకు అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ టిఎస్ చేతన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల అయింది. జిల్లా వ్యాప్తంగా సాగునీటి సంఘాల ఎన్నికలకు గెజిట్ విడుదల చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా మైనర్ ఇరిగేషన్ 214 సంఘాలు ఉన్నాయన్నారు. మీడియం ఇరిగేషన్ సంఘాలు 16 ఉన్నాయన్నారు. మొత్తం 230 సంఘాలు ఉన్నాయన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఆయా గ్రామాల పరిధిలో జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలలో సభ్యులు ఎలాంటి గొడవలకు తావు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

రైతులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం : వైసిపి



సమావేశంలో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-సోమందేపల్లి

కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ విమర్శించారు. మండల పరిధిలోని చల్లపల్లి గ్రామంలో మంగళవారం మండల వైసిపి సీనియర్ నాయకులు బాబు రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశానికి ఉషశ్రీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను నిండా ముంచుతోందన్నారు. అకాల వర్షాలు, అతివృష్టి, అనావృష్టి కారణాలతో రైతులు అల్లాడిపోతుంటే గిట్టుబాటు ధర కల్పించలేదని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో ఒకటైన ప్రతి రైతుకు 20వేల రూపాయలు మాట ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పార్టీ అధిష్టానం పిలుపుమేరకు సత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం వైసిపి చల్లపల్లి గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా ఎన్ రాజు, ఉపాధ్యక్షులుగా జి. మూర్తితో పాటు 12 మంది సభ్యులతో వివిధ కమిటీ అధ్యక్షులను నియమించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ గజేంద్ర, టౌన్ కన్వీనర్ గోవిందమ్మ గారి శ్రీనివాసులు, జడ్పిటిసి డిసి.అశోక్, సౌజన్య, సీనియర్ నేత కంబాలప్ప, వెంకటనారాయణ రెడ్డి, గుడిపల్లి కళ్యాణ్, ఈశ్వర్, సూర్య ప్రతాప్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, బాబు ప్రసాద్, హిమాంవలి తదితరులు పాల్గొన్నారు.



టిడిపి నాయకులు, కార్యకర్తలతో పరిటాల శ్రీరామ్

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మండలంలోని రేగాటిపల్లిలో జరిగిన టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వాల నమోదులో ధర్మవరాన్ని జిల్లాలోనే అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. రాష్ట్రంలో టాప్-5 స్థానంలో ఉండే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం తారకరామాపురంలో టిడిపి కార్యకర్త నరేష్ చేపట్టిన ఓ కార్యక్రమానికి హాజరైన పరిటాల శ్రీరామ్‌కు గ్రామస్తులు, నాయకులు ఘన స్వాగతం పలికారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి చర్యలు


ప్రజాశక్తి - మడకశిర

అందరి సహకారంతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఏ పీడీ నరసయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని చైతన్య మండల మహిళా సమాఖ్య, సెర్ప్ సిబ్బందికి, ఆర్‌వైఎస్‌ఎస్ సిబ్బందికి అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పీడీ మాట్లాడుతూ పకృతి వ్యవసాయం ద్వారా రైతులు మహిళా రైతులు అదనపు ఆదాయం పెంచుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో డిపిఎంలు రామిరెడ్డి,రామమోహన్, ఏరియా కో ఆర్డినేటర్ యస్.ఆర్.నాగరాజు, ఆర్‌వైఎస్‌ఎస్ టీమ్ రంగయ్య, రమేష్, నరసేగౌడ్,)లక్ష్మీకాంత్, కె.టి.నాగరాజు, మండల సమాఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్ల భూముల జోలికి వస్తే సహించం

ప్రజాశక్తి-పెనుకొండ

వడ్డెర్ల భూముల జోలికి వస్తే సహించేది లేదని వడ్డెర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దేవేళ్ళ మురళి అన్నారు. మంగళవారం మండలంలోని గుట్టూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవేళ్ళ మురళి, వడ్డే హనుమంత రాయుడు, వడ్డే నాగరాజు మాట్లాడారు. పెనుకొండ నియోజకవర్గం లోని రొద్దం మండలం ఆర్ ఎల్ కొత్తూరులో 30 ఏళ్ల క్రితం కదిరి పద్మనాభరావు, కుమారుల నుంచి భూమి కొనుగోలు చేశారన్నారు. పద్మనాభరావు కుమారులు ఆరుగురిలో రెండవ కుమారుడు నాగరాజు రావు కుటుంబ పోషణ ఇతరత్రా కుటుంబ వ్యవహారాలు చూసేవాడన్నారు. నాగరాజు రావుతో 20 మంది వడ్డెర కులస్తులు, బీసీలు ఎస్సీలు భూములు కొన్నారని వివరించారు. ఆసమయంలో మొత్తం నగదు చెల్లించారని, అనంతరం పొలాలు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారనిఅన్నారు. ఈ నేపథ్యంలో పద్మనాభ రావు కుమారులు మధ్య విభేదాలు వచ్చాయని కృష్ణారావు, వసంతరావు, సత్యనారాయణ రావు వన్‌బీలు చేయించుకున్నారని చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారికి 2021లో ఒకరికి తెలియకుండా ఒకరు 4 భాగాలు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అయితే ఈ భూములు కొన్న వ్యక్తులు రాలేదని బ్రహ్మానంద రెడ్డి అనే వ్యక్తి వడ్డెరలను ఇతర కులస్తులను భయభ్రాంతులకు గురిచేసి భూముల్లోకి వస్తే చంపుతామని బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. అగ్రిమెంట్ పత్రాలతో న్యాయం కోసం కోర్టును ఆశ్రయించిన బాధితులు బ్రహ్మానంద రెడ్డి నుంచి ఇబ్బందులుఎదురవుతున్నాయనిఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయం మంత్రి సవిత, ఎంపీ పార్థసారథిలతో చర్చించి వడ్డెర్ల కోసం పోరాటం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాసులు, హనుమయ్య, చంద్ర, గోవిందరాజులు, శ్రీరాములు, పల్లవ రాజు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

పాఠకులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పాఠకులు అందరికీ అన్ని సౌకర్యాలు కల్పిస్తూ గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ శాఖ ముఖ్య కార్యదర్శి రమా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మంగళ వారం పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల ప్రధాన గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ పండు బకాయిలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని అంజలీ సౌభాగ్యవతి, సిబ్బంది సత్య నారాయణ, శివమ్మ, రమణ నాయక్, గంగాధర్‌తో పాటు పాఠకులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారి

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేసిన వారు అవుతామని16వ వార్డు కౌన్సిలర్ కేతా లోకేష్ తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వైఎస్సార్ విగ్రహం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ లోకేష్, కార్యక్రమ నిర్వాహకులు బీరే శ్రీరాములు మాట్లాడుతూ ఈ శిబిరం చౌడేశ్వరి సేవా సమితి, రెడ్ క్రాస్ సొసైటీ తరపున నిర్వహిస్తున్నామన్నారు. రక్త దానం చేసి, ప్రాణదాతలు కావాలని తెలిపారు. ఈ శిబిరంలో 52 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రాముడు, రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, డాక్టర్ సత్య నిర్ధారన్, బోనాల శివయ్య, దాసరి మంజు,రక్తదాతలు పాల్గొన్నారు.



ముఖ్య అతిథిని సన్మానిస్తున్న దృశ్యం

మసీదు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో అర్థాంతరంగా ఆగిపోయిన జామియా మసీదు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని హిందూపురం తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం నంద్యాలలో మంత్రి ఫరూక్ ను కలిసి వినతిని అందజేశారు. స్పందించిన మంత్రి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు మైనార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు డైమండ్ బాబా, సయ్యద్ అంజాద్ ఖాన్, బాషా, ఆమీన్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ఫరూక్‌తో నాయకులు

నిరుద్యోగులకు అరేబియాలో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

బిఎస్‌సి నర్సింగ్, పోస్ట్ బిఎస్సి నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులకు అరేబియా దేశంలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా నైపుణ్య అభివద్ధి శాఖ అధికారి హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిఎస్సి నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, ఒకటిన్నర సంవత్సరాల అనుభవం ఉండి 35 ఏళ్లు లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు సౌదీ అరేబియాలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన మగవారికి భారత కరెన్సీ లో నెలకు సుమారు రూ. 78 వేలు, మహిళలకు భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ. 89 వేలు వేతనంఉంటుందన్నారు. ఈనెల 18 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9988853335 లేదా 8712655686 కి ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రేకులకుంట విద్యార్థిని

మడకశిర : మండల పరిధిలోని రేకులకుంట ఉన్నతపాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న ఎన్.గాయత్రి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. పాఠశాలలో చదువుతున్న గాయిత్రి ఈనెల 6 వ తేదీన జరిగిన జిల్లా స్థాయిలో వర్చువల్‌గా నిర్వహించిన కౌశల్ పరీక్ష లో ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయి కౌశల్ పరీక్షకు ఎంపికైందని హెచ్ఎం మాధవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని మోరుబాగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 -04 సంవత్సరం పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయులతో ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేవన్న, మహదేవ్,రాజగోపాల్, సునందమ్మ, నరసింహారెడ్డి, రవి,సుమంగళి,రంగనాథ్, పాండురంగప్ప, సిద్దేష్, రంగప్ప, వేణుగోపాల్ ,హరీష్ బాబు, కృష్ణమూర్తి, రమేష్, ముద్దిరప్ప తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులు, వారి గురువులు



కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా చేపట్టే కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆటవీశాఖాధికారి టి. చక్రపాణి ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. జిల్లాలో అడవికి ఆనుకొని ఉన్న 368 గ్రామాలలో గొర్రెలకాపరులు, పశువుల కాపరులకు, రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాలోని అడవిలో అగ్ని ప్రమాదాలను నివారించడానికి గల విషయాలపై 'అడవికి నిప్పు -మనిషికి ముప్పు' అనే నినాదంలో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో చేతన్‌తో పాటు బుక్కపట్నం ఆటవీక్షేత్రాధికారి యామిని సరస్వతి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చంద్ర నాయక్, ఫారెస్ట్ బీట్ అధికారులు రాహుల్, రమణ రెడ్డి, మహదేవప్ప, చిన్నప్పయ్య, ప్రదీప్ తేజ, అమర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండల పరిధిలోని గుండుమల గ్రామంలో మంగళవారం జరిగిన వైద్య శిబిరాన్ని టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి సందర్శించారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ప్రజాశక్తి - గుడిబండ

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారంనుంచి ఈనెల 17 వరకు మండలంలోని సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ సిబ్బందికి. అధికారులకు రెండు విడతలుగా స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గంగాధర్ తెలిపారు. 11,12 వ తేదీన మొదటి బ్యాచ్ కు 16, 17,వ తేదీన రెండో బ్యాచ్ కు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు.

14న మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఉన్నత న్యాయ స్థానం ఆదేశాల మేరకు ఈ నెల 14న కదిరి కోర్టులో మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. పలు కేసులను కక్షలు, గొడవలు లేకుండా మధ్య మార్గముగా పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. ఈ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని చెవిటివారిపల్లి, మద్దిమడుగు గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పంట సాగు, సస్యరక్షణ చర్యలపై రైతులకు అధికారులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ సనావుల్లా ఏవోభారతి, విహెచ్ఎభాస్కర్, ఎంపీఈవో మణికంఠ, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులకు భోజన వసతి

ప్రజాశక్తి - రొద్దం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు సత్య సాయి సేవ దళ్ సభ్యులు భోజన సౌకర్యం కల్పించారు. గర్భిణులతో పాటు ఆసుత్రికి వచ్చిన సహాయకులకు ఇతరులకు 150 మందికి భోజన సౌకర్యం కల్పించారు.

సోమందేపల్లి : రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత శాఖ మంత్రి సవితమ్మ నేతత్వంలో నడపబడుతున్న ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరికుమార్, ఓంకార్, తెలుగుదేశం మండల కన్వీనర్ సిద్ద లింగప్ప, నాయకులు మద్దిలేటి, డీలర్ రమేష్, నాగరాజు, ఆశాలు ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తలుపుల పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - తలుపుల

స్థానిక పోలీసుస్టేషన్‌ను డీఎస్పీ శివ నారాయణ స్వామి మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణపై స్థానిక ఎస్ఐ నరసింహుడుకు, పోలీసులకు పలు సూచనలు చేశారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

నియోజకవర్గం పరిధిలోని పోతుకుంట గ్రామానికి చెందిన 70 కుటుంబాలు జనసేన పార్టీలోకి మంగళవారం చేరారు. ఆ పార్టీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ చిలకం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో తిమ్మయ్య, నారాయణస్వామి, సూర్యనారాయణ, ప్రకాష్, రవికుమార్, రాఘవేంద్ర, నంద కుమార్,మురళి, మణికంఠ,నారాయణమ్మ తదితరులతో పాటు 70 కుటుంబాలు జనసేనలోకి చేరాయి. ఈ కార్యక్రమంలో పోతుకుంట గ్రామ బీసీ ప్రజలు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన వారితో 'చిలకం'

మహిళలకు రక్షణ కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

రోజురోజుకూ మహిళలపై దాడులు అధికమవుతున్నాయని ఈ నేపథ్యంలో ప్రభుత్వం మహిళలకు మరింత రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. మన హక్కులే- మన భవిష్యత్తు అనే నినాదాలతో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ సందర్భంగా పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1948 డిసెంబర్ 10వ తేదీన సర్వజనీన మానవ హక్కుల దినోత్సవం గా ఐక్యరాజ్యసమితి ఆమోదించిందన్నారు. అయినప్పటికీ నిత్యం మహిళల పైన, విద్యార్థినిల పైన దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హింసను ఐక్యరాజ్యసమితి 2000 ఫిబ్రవరి 7న ఒక తీర్మానం చేసిందన్నారు. కర్నూలు జిల్లా నందికొట్కూరులో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న లహరి అనే విద్యార్థిని పెట్రోల్ పోసి దారుణంగా హతమార్చారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్ జాన్, నాయకులు అఖిల్, విజయ్ ఐద్వా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, నాయకులు సుజాత, మున్ని, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మానవహారంలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు, విద్యార్థులు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు వేతనాల పెంపుతో పాటు న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు విధులు బహిష్కరించి చేపట్టిన సమ్మె మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా కార్మికులు మున్సిపల్ కార్యలయం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు అక్కడి నుండి తిరిగి మున్సిపల్ కార్యలయం వరకు ర్యాలీ చేపట్టి, కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో సమ్మెలో కుర్చొన్నారు. ఈ సందర్భంగా నాయకులు బాబా ఫక్రోద్దీన్, రఘు, కోటీ మాట్లాడుతు తమ సమస్యలను పరిష్కరించే వరకు విధులకు హాజరు కాకుండా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అవుట్‌సోర్సింగ్, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు పాల్గొన్నారు.

తప్పిపోయిన యువకుడు మృతి

ప్రజాశక్తి - రొద్దం

ఐదురోజుల క్రితం తప్పిపోయిన మండలంలోని నారనాగేపల్లి గ్రామానికి చెందిన యువకుడు మృతచెందాడు. గ్రామానికి చెందిన ఈడిగ వినోద్ (30) ఐదురోజుల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని బావిలో వినోద్ మృతదేహం లభ్యమైంది. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణానికి చెందిన మహిళ ధర్మవరం చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. పట్టణానికి చెందిన వెంకటనారాయణ భార్య లక్ష్మీదేవి (60) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. ఈ నేపథ్యంలో మనస్థాపం చెందిన ఆమె మంగళవారం ధర్మవరం చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సిఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

బంగారు ఆభరణం అపహరణపై ఫిర్యాదు

ప్రజాశక్తి కదిరి టౌన్

బంగారు ఆభరణాల అపహరణపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి రామసుభద్ర ఇచ్చిన ఫిర్యాదు వివరాలను సిఐ వెల్లడించారు. శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవాలయం నందు జూనియర్ అసిస్టెంట్ గా పనిచేయుచున్న రామ సుభద్ర పట్టణంలోని జొన్నా వీధి నందు నివాసముంది. ఆమె ఇంటి ముందు నివాసముండే కదిరి మున్సిపాలిటీ నందు స్వీపర్ గా పనిచేస్తున్న శారద గత బుధవారము పెళ్ళికి వెళు ్ళ నిమిత్తం తనకు బంగారు దండ కావాలని రామసుభద్రను అడిగింది. దీంతో రామసుభద్ర శారదకు బంగారు దండ ఇవ్వగా తిరిగి అదే రోజు మధ్యాహ్నం శారద రామసుభద్రకు దండ తిరిగి ఇచ్చింది. శారద ఇచ్చిన దండను ఆమె ముందరే రామసుభద్ర బీరువాలో పెట్టి, ఇంటికి గడియ పెట్టి, పక్కింటికి వెళ్ళింది. అయితే మరుసటి రోజు బీరువాను తెరిచిచూడగా బంగారు దండ కన్పించలేదని రామసుభద్ర పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుమారు ఆరుతులాల బంగారు దండ అపరహణపై కేసు ఛేదించి తనకు న్యాయం చేయాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన బంగారు వస్తువులను ఎదురింటి శారదా గానీ, మరెవరైనా గానీ దొంగిలించి ఉంటారని అనుమానాస్పద కేసు పెట్టిందని సిఐ చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ చెప్పారు.

సర్పంచిపై దాడి

ప్రజాశక్తి గోరంట్ల

మండలంలోని ఒడిగేపల్లి పంచాయతీ సర్పంచి నరసింహమూర్తిపై బుడ్డపల్లికి చెందిన శ్రీనివాస్ రెడ్డి దాడి చేశాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈసందర్భంగా సర్పంచి నరసింహమూర్తి మాట్లాడుతూ బుడ్డ పల్లి గ్రామంలో ఎన్ ఆర్ జి ఎస్ నిధులతో సిమెంట్ రోడ్డు వేయడానికి జెసిబి తో రోడ్డు క్లీన్ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి సిమెంట్ రోడ్డు వేయకూడదని అడ్డుతగిలి తనపై దాడి చేశాడని తెలిపాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు గ్రామానికి వెళ్లి విచారించి దాడి చేసిన శ్రీనివాస్ రెడ్డిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని కెఎన్. పల్లి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజకుల్లాయప్ప తెలిపారు. వారి వద్ద నుండి 6160 రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉరుసు ఉత్సవాల గోడపత్రికలు విడుదల



గోడ పత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

పెనుగొండలోనిసయ్యద్ బాబా ఫక్రుద్దీన్ 752 ఉరుసు ఉత్సవాల పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. పట్టణంలోని గౌసియా మసీదు ఆవరణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మత పెద్దలు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 13న 37వ జాతీయ సమైక్యత సెమినార్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సెమినార్ కు రాష్ట్ర మంత్రులతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖులు పాల్గొంటారన్నారు. 14, 15న ఖవ్వాలితో పాటు వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆంధ్ర తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌసియా మసీదు నిర్వాహకులు ఫారూఖ్ సేట్, అఖిల భారత ఫ్రీడమ్ ఫైటర్ షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్, అహలే సున్నతుల్ జమాత్ ఉపాధ్యక్షులు ఇద్రిస్, కోశాధికారి షబ్బీర్, మౌలానాలు, గౌసియా మదరసా విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ హక్కుల ఉల్లంఘన అంతర్జాతీయ నేరం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

మానవ హక్కులను పరిరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు.. మంగళవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ వేడుకలు లోక్ అదాలత్ ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని ఐకాన్ జూనియర్ కళాశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా న్యాయమూర్తి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ భావవ్యక్తీకరణ, నిర్బంధ విద్య, ఆరోగ్యం, శ్రేయస్సు వంటి అంశాలు మానవ హక్కుల్లో ఉన్నాయన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉన్నప్పుడే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాదులు సుదర్శన్, కళావతి, సంతోషి కుమారి, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సురేష్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బాబా ఖాన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బైరిశెట్టి, అకాడమిక్ డీన్ వెంకట నందన్, కళాశాల అధ్యాపకులు నాసిర్, శంకర్, గాయత్రి, యామిని, తిప్పేస్వామి, లోక్ అదాలత్ సిబ్బంది శారద, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : మానవ హక్కుల ఉల్లంఘన అంతర్జాతీయ నేరం అని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కేశవరావు అన్నారు. మంగళవారం కళాశాలలో రాజనీతి శాస్త్రం ఆధ్వర్యంలో అంతర్జాతీలు మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘనను నేరంగానే పరిగణించాల్సి ఉంటుందన్నారు. ఆయా ప్రభుత్వాలు అంతర్జాతీయ సంస్థలు వీటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హక్కులు వ్యక్తిత్వవికాసానికి, స్వజనాత్మకతకు దోహదపడతాయన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. జయప్ప మాట్లాడుతూ సాంఘిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల అభివృద్ధికి మానవహక్కులు గీటురాయి అని అన్నారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి.ఎల్ కాంతారావు మాట్లాడుతూ యుద్ధాల కొనసాగింపు, తదనంతర నష్టాలు హక్కుల ఉల్లంఘనకు దారితీస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐ క్యు ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ యశోద రాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కెహెచ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ కె. ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన రాజనీతి శాస్త్రం విభాగ అధిపతి డాక్టర్ బి. గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ చిట్టెమ్మ మాట్లాడుతూ మానవహక్కుల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పావని, కిరణ్ కుమార్, భువనేశ్వరి, పుష్పావతి,మీనా, ఆనంద్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా ఇంటర్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సాయికృప జూనియర్ కాలేజీలో అవగాహన సదస్సును నిర్వహించారు ఈ కార్యక్రమానికి వన్‌టౌన్ సిఐ నాగేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవహక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ లీగల్ సెల్ ప్రెసిడెంట్ సుమలత, సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఇ. ప్రతాప్ రెడ్డి, సాయికృప జూనియర్ కాలేజీ కరెస్పాండెంట్ భగవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలం పరిధిలోని మానేపల్లి పంచాయతీలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ సిబ్బంది, డ్వాక్రా సంఘాల మహిళలు జెండర్ ఆధారిత హింస పై గ్రామంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సచివాలయ మహిళ పోలీసు భార్గవి మాట్లాడుతూ గుడ్ టచ్- బ్యాడ్ టచ్, మహిళల వస్త్ర ధారణ, ఒంటరి మహిళల స్వీయ రక్షణ, రుతుస్రావ పరిశుభ్రత, తదితర విషయాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నిర్మల, భార్గవి ,సచివాలయ కార్యదర్శులు మల్లికార్జున, రవికుమార్,దుర్గ భవాని, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని జానకంపల్లి సమీపంలో గ్రామానికి చెందిన మాజీ స్వతంత్ర సమరయోధుడు జివి సత్యనారాయణ కుమారుడు జివి ప్రకాష్ కు చెందిన భూమిని ఆర్డీవో సువర్ణ మంగళవారం పరిశీలించారు. సర్వే నంబర్ 1915-1లోని 2.68 ఎకరాల తమ భూమికి హద్దులు చూపించాలని ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో మంగళవారం స్థానికరెవెన్యూ అధికారులతో కలిసి భూమిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షాబుద్దీన్, డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని బాలసముద్రం గ్రామ జంబులింగేశ్వర స్వామి ఆలయములో మంగళవారం టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సోంపాలెం నాగభూషణ కుటుంబసభ్యులు అయప్ప మాలాధారులకు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగభూషణ కుటుంబసభ్యులు పార్వతమ్మ, సోంపాలెం అఖిల్ కుమార్‌తో పాటు రజక సంఘం కదిరి నియోజకవర్గ అధ్యక్షుడు మిరాశి వేమనారాయణ, మల్లికార్జున, గౌనూరి గోపి, పులి మహేష్, అయ్యప్ప మాలాధారులు పాల్గొన్నారు.

పరిగి : మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్ప స్వామి మాలాదారులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనంఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రి భర్త వెంకటేశ్వర్లు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి. మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ. మాజీ ఎంపీపీ సత్యనారాయణ. సర్పంచి బాలాజీ కరణం లక్ష్మణ్ రావు, పెనుగొండ టిడిపి కోఆర్డినేటర్ మంజు, శాసనకోట వెంకటేష్ నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



ఫిర్యాదును పరిశీలిస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి - లేపాక్షి

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తోందని కలెక్టర్ టిఎస్. చేతన్ న్నారు. మండలంలోని శిరివరం గ్రామం సచివాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామస్తులతో స్థల సేకరణ విషయం చర్చించి స్థలాన్ని అందజేయడానికి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను గ్రామాల్లో సివిల్ సమస్యలు ఉంటే గ్రామ పెద్దల ద్వారా లేదా సివిల్ కోర్టులో పరిష్కరించుకోవాలని సూచించారు. భూ హక్కుల వివరాలను గ్రామాల్లో ప్రజలకు అధికారులు తెలియజేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. చెరువులు కాలువలు చెరువు గర్భాలు కాలువ గట్టుపై పట్టాలిచ్చే హక్కు ప్రభుత్వానికే లేదన్నారు. అలాంటి వారు ఉంటే ఆయా స్థలాలు ఖాళీ చేయాలని అన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులంతా రెవెన్యూ సదస్సులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని చెప్పారు. రీ సర్వే, అడంగల్‌లో చేర్పులు మార్పులు, సర్వే నంబర్లు తప్పుగా వేయడం, ఆర్ఎస్ఆర్ రికార్డులు, భూమి కొనుగోలు, విక్రయాల తదుపరి పేర్ల మార్పిడి, ఆక్రమణలు, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన వాటి వివరాలు తెలుసుకోవడానికి రెవిన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 56 సర్వీసులు ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. రెవిన్యూ యంత్రాంగమంతా గ్రామ ప్రజల వద్దకే వస్తుందని, రికార్డులన్నీ అందుబాటులో ఉంచుతారని వివరించారు. ప్రజలు నేరుగా వచ్చి తమ వినతిపత్రాల ద్వారా రికార్డులలో పరిస్థితిని తెలుసుకోవచ్చన్నారు. సదస్సుల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి ఏపీఎంఐపి పీడీ సుదర్శన్, పెనుకొండార్డీవో ఆనంద్, సర్పంచి నేత్రావతి, ఎంపీడీవో నరసింహామూర్తి, తహశీల్దార్ సౌజన్య లక్ష్మి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : పేదలకు ఇచ్చిన అసైన్మెంట్ భూములు ఇళ్ల స్థలాలు ఆక్రమించుకుంటే వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆదేశించారు. కొత్త చెరువు గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో మంగళవారం రెవిన్యూ సదస్సును తహశీల్దార్ నీలకంఠారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ పేదల భూములు అన్యాక్రాంతం కాకూడదన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి భూ సమస్యలు లేకుండా వాటిని అధికారులు పరిష్కరించాలన్నారు. రెవిన్యూ సదస్సుకు హాజరుకాని అధికారులకు తక్షణమే మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రాధా నాగరాజు, ఎంపీడీవో నటరాజు, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచి మాణిక్యం బాబా, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, శ్రీనివాసులు, కాంటాక్ట్ లక్ష్మీనారాయణ, నల్లమాడ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓబులదేవర చెరువు : భూ తగాదాలను ఈ రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రజలకు సూచించారు. ఓడి చెరువు మండలంలోని వీర ఓబునపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవిన్యూ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో భూతగాదాల ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. గత వైసిపి ప్రభుత్వ నిర్వాహకం వల్ల భూ సమస్యలు అధికంగా ఉన్నాయని వాటి పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని అన్నారు. ఈ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, తహశీల్దార్ ఆనందాచారి, ఎంపీడీవో విల్సన్ రాబర్ట్, ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు, టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర , మాజీ జడ్పిటిసి పిట్ట ఓబుల్ రెడ్డి , సర్పంచి శంకర్ రెడ్డి , అంజినప్ప, నిజాం, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: భూ సమస్యలు లేని ఆంధ్రప్రదేశ్‌గా మారుద్దామని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు .పుట్టపర్తి మండలంలోని దిగువ చెర్లోపల్లి పంచాయతీలోని గంగిరెడ్డిపల్లి సచివాలయం వద్ద మంగళవారం ఏర్పాటుచేసిన రెవిన్యూ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆస్తి ప్రజల హక్కు అని అన్నారు. జగన్ గతంలో రాష్ట్రంలో భూ అలజడి సృష్టించి గ్రామాల్లో కక్ష్యలు నెలకొల్పేలా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ విజయ్ కుమార్, మాజీ ఎంపిపి శ్రీరామ్ రెడ్డి, సర్పంచి కామాక్షమ్మ మండల తాహశీల్దార్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : గ్రామాల్లో ఎవరికైనా రెవెన్యూ సమస్యలు ఉంటే అర్జీ రూపంలో తమ దృష్టికి తెస్తే వాటికి పరిష్కారం చూపిస్తామని తహశీల్దార్ స్వర్ణలత అన్నారు. మంగళవారం మండలంలోని డి. చెర్లోపల్లిలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ జోసెఫ్, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ , గ్రామ రెవిన్యూ అధికారి కుళ్లాయప్ప, గ్రామ సర్వేయర్ లావణ్య, గ్రామ సర్పంచి, గ్రామస్తులు పాల్గొన్నారు.



బత్తలపల్లి రెవెన్యూ సదస్సులో అధికారులు

చిలమత్తూరు : మండల పరిధిలోని చాగలేరు గ్రామపంచాయతీ కేంద్రంలో రెవెన్యూ గ్రామ సదస్సును మంగళవారం నిర్వహించారు. పలు భూ సమస్యలపై రైతులు తహశీల్దార్ యూనస్ బాబుకి విన్నవించారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బంది విచారణ చేశారు. సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని అన్నారు.

గాండ్లపెంట : రెవెన్యూ సదస్సులో రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆర్డీవో కోరారు. మంగళవారం మండల పరిధిలోని సోమయాజులపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కదిరి ఆర్డీవో విఎస్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి బాబురావు, ఎస్ఐ ఇషాక్ బాషా, సీనియర్ అసిస్టెంట్ జాఫర్, వీఆర్వోలు వెంకటరమణ, అమానుల్లా, రామ్మోహన్, చంద్రశేఖర్, టిడిపి నాయకులు డి ఆనంద్ రైతులు తదితరులు పాల్గొన్నారు

అగళి : మండలంలోని నిరసంబుది పంచాయతీలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్బారావు, చంద్రశేఖర్, రెవెన్యూ కార్యదర్శి నరసింహమూర్తి, టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.